క్లుప్తంగా

పకడ్బందీగా ఓటర్ల జాబితా



బీఎల్‌ఓ కేంద్రాలను పరిశీలిస్తున్న కమిషనర్

పుంగనూరు: ఓటర్ల జాబితా పకడ్బందీగా తయారు చేసేందుకు, మార్పులు–చేర్పులు, నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన పట్టణంలోని బీఎల్‌ఓ కేంద్రాలను పరిశీలించారు. బీఎల్‌ఓలకు, సిబ్బందితో మాట్లాడారు. పట్టణంలో 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటర్లుగా నమోదు చేస్తున్నామన్నారు. అలాగే ఒకరికి రెండు మూడు ప్రాంతాల్లో ఓట్లు, చనిపోయిన వారి వివరాలు, మార్పులు–చేర్పులు నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. ఇందు కోసం 41 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. సచివాలయ కార్యదర్శులు, బీఎల్‌ఓలు తమ పరిధిలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వకుండా సమర్థవంతంగా జాబితాను రూపొందించాలని ఆదేశించారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు

పలమనేరు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో రైతుల సౌకర్యార్థం వీలుగా ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. తిరుమల మిల్క్ డెయిరీ సౌజన్యంతో వీటిని ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు.

పైపులైన్లు ఏర్పాటు



కుప్పం: స్థానిక మునిస్వామి పురంలో కొత్తగా తాగునీటి పైపులైన్లను ఆదివారం ఏర్పాటు చేశారు. కొంత కాలంగా తాగునీటి పైపులైన్లు లేకుండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలను కౌన్సిలర్ రాజ్‌కుమార్ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. పైపులైన్లు మంజూరు చేశారు.

హైదర్ మృతికి సంతాపం

పుంగనూరు: న్యాయవాదిగా ఉంటూ రెండు పర్యాయాలు మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన ఎస్.హైదర్ (60) గుండెపోటుతో శనివారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన మృతికి స్థానిక న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గల్లా శివశంకర్‌నాయుడు, సంఘ ప్రతినిధుల తోపాటు పలువురు పట్టణ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

తిరుపతికి వెళ్లి పెన్షన్ పంపిణీ



స్విమ్స్‌లో రామయ్యకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ దుర్గ

పులిచెర్ల(కల్లూరు): కల్లూరుకు చెందిన కన్నా రామయ్య అనారోగ్యంతో తిరుపతిలోని స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఇతను తెలుగు దేశం పార్టీ సానుభూతిపరుడైనప్పటికీ పార్టీలకతీతంగా ప్రభుత్వం అతడికి పింఛను మంజూరు చేసిందని సర్పంచ్ షుకూరు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం వలంటీర్ దుర్గ స్విమ్స్‌కు వెళ్లి రామయ్యకు పింఛను అందజేసింది.

ఏడు దశాబ్దాల సమస్యకు పరిష్కారం!

- మంత్రి పెద్దిరెడ్డి చొరవతో బీసీ కమిషన్ దృష్టికి పెరుమళ్లై కల్లర్ కులస్తుల సమస్య
- బీసీ జాబితాలో చేర్చేలా చర్యలు
- హర్షం వ్యక్తం చేసిన పెరుమళ్లై కల్లర్ కులస్తులు



రెండ్రోజుల క్రితం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన పెరుమళ్లై కల్లర్ కుల సంఘ నాయకులు



హర్షం వ్యక్తం చేస్తున్న పెరుమళ్లై కల్లర్ కులస్తులు

పలమనేరు: వారంతా తమిళనాడు రాష్ట్రం నుంచి 75ఏళ్ల ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలకు వచ్చి స్థిర పడ్డారు. తినుబండారాలను తయారుచేసి వాటిని చిన్న అంగళ్లకు విక్రయిస్తూ కుటుంబాలను పోషించుకోవడమే వీరికి జీవనోపాధి. ఈ నేపథ్యంలో వీరి కులమైన పెరుమళ్లై కల్లర్ పేరు మన రాష్ట్రంలోని బీసీ జాబితాలో లేదు. దీంతో వీరి పిల్లలు పాఠశాలలో చేరాలన్నా కుదరలేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వీరి దరికి చేరలేదు. ఈ సమస్యపై వీరు దశాబ్దాలుగా ప్రభుత్వాలకు విన్నవిస్తూనే ఉన్నా ఫలితం శూన్యం. ఇటీవల పలమనేరులో పలువురు ఈ కులస్తులు స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడను కలసి సమస్యను నివేదించారు. ఆయన సూచనతో జిల్లాకు చెందిన పెరుమళ్లై కల్లర్ కుల సంఘ నాయకులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రెండ్రోజుల క్రితం తిరుపతిలో కలిశారు. తమకు కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయించాలని కోరారు. మంత్రి దీనిపై స్పందించారు. ఆయన సూచనలతో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ తేవర్ మంత్రి చెల్లుబోయిన గోపాలక్రిష్ణను కలిసి తమ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన ఈ అంశాన్ని బీసీ కమిషన్ విచారణకు పంపారు. త్వరలో ఈ కులస్తుల విషయమై బీసీ కమిషన్ విచారణ చేసి ఈ కులాన్ని బీసీ జాబితాలో చేర్చే దిశగా చర్యలు సాగుతున్నాయి. ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తమ కులానికి మేలు జరుగుతుందని ఆ కుల రాష్ట్ర, జిల్లా నాయకులు సౌందర్‌రాజన్, రాజాతేవర్, చెల్లతంగం, మణికాళై ఆశాభావం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

'భగవద్గీత పారాయణం చేస్తే ఆత్మ జ్ఞానం'





కుప్పంరూరల్ : ప్రబోధానంద రచనలపై ప్రచారం చేస్తున్న సభ్యులు, పలమనేరులో..

కుప్పం రూరల్: ప్రబోధానంద విరచిత త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలపై మండలంలోని క్రిష్ణదాసన పల్లె, యానాదిపల్లె గ్రామాల్లో ప్రబోధానంద సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మ ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. ఇందులో మధ్యదైన ఆత్మను ఆరాధించడం వల్ల ధర్మస్థాపన జరుగుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత పారాయణం చేయాలని, ఇది జ్ఞానం, శాంతి స్థాపనకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రబోధానంద సేవా సమితి సభ్యులు నాగరాజు, కృష్ణ, శివకృష్ణ, చరణ్, ఇందిర, లక్ష్మి, రాధ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు మండలంలో..

పలమనేరు: మండలంలోని సముద్రపల్లెలో త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను స్థానిక ప్రబోధ సేవాసమితి నిర్వాహకులు ఆదివారం పంపిణీ చేశారు. గీతలోని అన్ని విషయాలు మానవ జీవితం సరైన వెళ్లడానికి మార్గం చూపుతాయన్నారు. భాస్కర్, బాలాజి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఒకటో తేదీనే పింఛన్లు ప్లీజ్!



సమావేశంలో మాట్లాడుతున్న గురురాజారావు

పలమనేరు: రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీనే ప్రభుత్వం పెన్షన్లు చెల్లించాలని ఏపీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు గురురాజారావు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ఏపీ ఎన్జీవోల కార్యాలయంలో ఆదివారం సంఘ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వృద్ధాప్యంలో ఇబ్బందులు పడకుండా పెన్షనర్లకు ప్రభుత్వం మానవతా దృక్పథంతో నెల తొలిరోజే పింఛను అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు క్రిష్ణమూర్తి, గౌస్, అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 38 మంది ఎంపిక



జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులు

కుప్పం: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సాయిమాత సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సాహి ఎక్స్‌పోర్ట్ కంపెనీ నిర్వహించిన జాబ్ మేళాలో 38 మంది ఎంపికయ్యారు. మేళాలో ఇంటర్వ్యూలకు 85 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో అర్హత కలిగిన 38 మందిని ఎంపిక చేసి నియామక పత్రాలను సాహి ఎక్స్‌పోర్ట్ కంపెనీ ప్రతినిధులు అందజేశారు. సోమవారం నుంచి ఉద్యోగాల్లో చేరాలన్నారు. కార్యక్రమంలో సాయి మాత సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్ బాబు, సాహి ఎక్స్‌పోర్ట్ ప్రతినిధులు శంకర్రావు, వంశీకృష్ణ, మనోజ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదు వేగవంతం చేయండి: ఆర్డీఓ



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఆర్డీఓ

రామకుప్పం: కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని బీఎల్‌ఓలను కుప్పం రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం స్థానిక పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. బీఎల్‌ఓ, బీఎల్‌ఏలతో మాట్లాడారు. ఫారం -6,7,ఫారం-8లకు సంబంధించి ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ల నమోదులో ప్రజలు ఏవైనా పొరపాటుగా నమోదు చేసినా మార్పులకు అవకాశం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను నూతన ఓటర్లుగా నమోదుకు బీఎల్‌ఓలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దిలీప్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలి



నాగిరెడ్డిని సన్మానిస్తున్న సర్పంచులు

రొంపిచెర్ల: గ్రామాభివృద్ధిలో సర్పంచులే కీలకపాత్ర పోషించాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. ఇటీవలే మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన నాగిరెడ్డిని ఆదివారం రొంపిచెర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచులు ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ మాట్లాడారు. అభివృద్ధి పనులకు నిధులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డికి పూలమాలలు వేసి, శాలువలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఇబ్రహీంఖాన్, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సర్పంచులు జీవలత, సుధారాణి, హేమలత, రమణయ్య, ప్రసాద్‌నాయుడు, అన్సర్ బాషా, పార్టీ నాయకులు డాక్టర్ శ్రీనాథ్, ఆర్.అలీంఖాన్, సురేంద్రనాయుడు, కరీముల్లా, సూర్యనారాయణ రెడ్డి, చిన్న నాగరాజ, లక్ష్మయ్య, శ్రీనాధనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజా సంకల్పయాత్ర' సంబరాలు

చౌడేపల్లె: తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర నిర్వహించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం చౌడేపల్లెలో సంబరాలు నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ అంజిబాబు తెలిపారు. బస్టాండులోని వైఎస్సార్ కాంస్య విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు ఘన నివాళులర్పిస్తామని, ఆ తర్వాత సంబరాలు నిర్వహిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీనేతలు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మోసపూరిత టీడీపీని నమ్మొద్దు



13 వార్డులో మహిళలకు పసుపు, కుంకుమ చీరను అందజేస్తున్న దుర్గ

- భరత్‌కు అండగా ఉండండి
- ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్సీ సతీమణి అభ్యర్థన

కుప్పం: ఏళ్ల తరబడి కుప్పం ప్రజలను మోసం చేస్తున్న టీడీపీని నమ్మొద్దు ...అందరికీ అందుబాటులో ఉన్న ఎమ్మెల్సీ భరత్‌ను ఆదరించాలని ఆయన భార్య దుర్గ ప్రజలను కోరారు. ఆదివారం స్థానిక 13వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. మహిళలకు పసుపు, కుంకుమతో పాటు చీరలు సారెగా అందజేశారు. మీ అందరి ఆడబిడ్డగా ఇంటింటికీ తాను వస్తున్నట్టు ఆమె ప్రజలతో మమేకమయ్యారు. ఆమె మాట్లాడుతూ, చంద్రబాబునాయుడు కుప్పానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించినా, సీఎంగా ఉన్నా ఆయన ఇక్కడ స్థిర నివాసం ఉన్న పాపానపోలేదని, ఆయన తన హయాంలో ఆచేసింది శూన్యమని విమర్శించారు. అందరికీ అందుబాటులో ఉంటూ, ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న తన భర్తను రాబోవు ఎన్నికల్లో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కులమతాలు, పార్టీలకతీతంగా ప్రజలకు చేస్తున్న మంచిని గుర్తించి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, కౌన్సిలర్ హంస, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వికలాంగులకు సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న బాల గురునాథ్

వి.కోట: మండల వికలాంగులకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బాల గురునాథ్ అన్నారు. ఆదివారం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో మండల వికలాంగుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బాల గురునాథ్ మాట్లాడారు. వికలాంగులకు అవసరమైన వాటిని ప్రభుత్వం ఇస్తోందని, ఏమేమి కావాలో ఆ వివరాలను మండల పరిషత్ కార్యాలయంలో అర్జీ రూపంలో తెలియజేస్తే వీల్ ఛైర్లు, మూడు చక్రాల సైకిళ్లు, వాకర్లు ఊత కర్రలు మొదలైన వాటిని మంజూరు చేయించి ఉచితంగా ఇస్తారన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, మండల వికలాంగులు పాల్గొన్నారు.

'ఏపీకి జగనే కావాలి' విజయవంతం చేయండి



సర్పంచులకు కిట్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రొంపిచెర్ల: ఈ నెల 9 నుంచి నిర్వహించనున్న 'ఏపీకి జగన్ కావాలి' కార్యక్రమాన్ని ప్రజలు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. ఆదివారం రొంపిచెర్లలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రానికి జగన్ మోహన్‌రెడ్డి ఎంత అవసరమో ప్రజలకు చాటిచెప్పాలన్నారు. అలాగే గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, నాయకులు పల్లెనిద్ర చేయాలని కోరారు. అనంతరం ఏపీకి జగన్ కావాలి కార్యక్రమ కిట్లను సర్పంచులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, వైస్ ఎంపీపీ విజయశేఖర్, పార్టీ నాయకులు డాక్టర్ శ్రీనాథ్, కరీముల్లా, సూర్యనారాయణ రెడ్డి, శ్రీనాధనాయుడు, సురేంద్రనాయుడు, చిన్న నాగరాజ, లక్ష్మయ్య, సర్పంచులు నాగిరెడ్డి, జీవలత, హేమలత, అన్సర్‌బాషా, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గణిత ప్రజ్ఞాధారణలో విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

కుప్పం: మానవ కంప్యూటర్‌గా పేరొందిన శకుంతలాదేవి జయంతి పురస్కరించుకుని ద్రవిడ విశ్వవిద్యాలయంలో ఆదివారం గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్సిటీ మ్యాథమాటిక్స్, స్టాటిస్టిక్స్ విభాగాలు, జనవిజ్ఞాన వేదిక, ఏపీ మ్యాథ్స్ ఫోరం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. బంగారుపాళ్యం మండలం మంగళపల్లి జెడ్పీ హైస్కూలు విద్యార్థులు హేమ, లహరి, రేవతి, పునిత్ సాయి గణితంలో తమ అసాధారణ ప్రతిభను చాటారు. వంద రెండెంకల సంఖ్యలను విని వాటిని మొదటి నుంచి చివరి వరకు, అలాగే వెనుక నుంచి ముందుకు తెలియజేయడం, ఆ రెండు వందల సంఖ్యను 5తో, 25తో గుణించి వాటి ఫలితాన్ని తెలిజేయడం వర్సిటీ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. వారిని అభినందించారు. విద్యార్థులకు వర్సిటీ అధికారులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

సెమిస్టర్ పరీక్షల్లో ఐఆర్‌ఎం విద్యార్థులు..

కుప్పం: తమ కళాశాల విద్యార్థులు మొదటి సెమిస్టర్ పరీక్షల్లో ప్రతిభ చాటారని స్థానిక ఐఆర్‌ఎం కళాశాల చైర్మన్ దయానిధి ఆదివారం తెలిపారు. ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాల్లో బీఎస్సీలో త్రిష 9.25, బీకాంలో శ్రీజ 9.23 బీబీఏలో జీవిత 8.53 పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని ఆయన పేర్కొన్నారు. ఆ విద్యార్థినులను ఆయన అభినందించారు.

పెండింగ్ పనులు పూర్తిచేయకపోతే మరొకరికి కేటాయిస్తాం



బోయకొండలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న చైర్మన్, ఈఓ తదితరులు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద కోట్లాది రూపాయలతో చేస్తున్న పలు పనులను మధ్యలో నిలుపుదల చేసినా, పురోగతి లేకున్నా, సకాలంలో పూర్తి చేయకున్నా వాటిని వేరొకరికి కేటాయిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి హెచ్చరించారు. ఆదివారం బోయకొండలో జరుగుతున్న పనులను చైర్మన్, ఆలయ ఈఓ చంద్రమౌళి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో కలిసి పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయని పక్షంలో సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసి ఆ పనులను వేరొకరికి కేటాయిస్తామన్నారు. బోయకొండ ఆలయం వద్ద, గంగాపురంలోని దుకాణదారులు భక్తులకు నాణ్యమైన వస్తువులను మాత్రమే విక్రయించాలని, అధిక రేట్లకు విక్రయిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం టికెట్ల కౌంటర్, దుకాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు పవన్ , రాజేష్ నేతలు సోమల మల్లికార్జునరెడ్డి, నవీన్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టపాకాయల దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దార్, సీఐ, ఎఫ్ఆర్ఓ

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్ క్లబ్‌లో టపాకాయల దుకాణాల ఏర్పాటు నిమిత్తం ఆదివారం సాయంత్రం ఆదివారం సాయంత్రం తహసీల్దార్ సీతారామన్, సీఐ రాఘవరెడ్డి, ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు స్థల పరిశీలన చేశారు. దుకాణాల ఏర్పాటు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి లైసెన్సుదారులతో మాట్లాడారు. లైసెన్సులు పొందిన వారు మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేయాలని, అగ్ని ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే లైసెన్సులు రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

క్రీడాకారిణికి అభినందన



హర్షితను అభినందిస్తున్న మదర్ థెరిసా కళాశాల యాజమాన్యం

పలమనేరు: సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు జేఎన్‌టీయూ అనంతపూర్ తరఫున ఎంపికైన తమ కళాశాల బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని హర్షితను ఆదివారం మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఎం. రవీంద్రబాబు, చైర్మన్ ఎంఆర్.సునీల్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి అభినందించారు. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన సౌత్‌జోన్ కబడ్డీ క్రీడాకారుల ఎంపికలో రీజియన్‌లోని పలు కళాశాలలకు చెందిన 210మంది క్రీడాకారులు హాజరు కాగా వీరిలో జట్టుకు ఎంపికైన 12మందిలో హర్షిత కూడా ఉండటం విదితమే. సౌత్ జోన్ కబడ్డీ పోటీల్లోనూ సత్తా చాటి పేరు తేవాలని ఆకాంక్షించారు.

డ్రైవింగ్ పేరుతో దందా

జిల్లాలో డ్రైవింగ్ స్కూళ్ల దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. కరోనా తర్వాత ప్రజలు సొంత వాహనాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఉద్యోగులు, యువత, గృహిణులు డ్రైవింగ్ నేర్చుకునేందుకు మక్కువ చూపిస్తున్నారు. దీంతో జిల్లాలో డ్రైవింగ్ స్కూల్స్ కుప్పలుగా పుట్టుకొస్తున్నాయి. ఈ క్రమంలోనే కొందరు డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు డీటీసీ కార్యాలయంలో పెత్తనం చలాయిస్తున్నారు. లైసెన్స్ పేర్లతో భారీ వసూళ్లకు తెరతీస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు రావడంతో చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

- జేబులు నింపుకుంటున్న డ్రైవింగ్ స్కూళ్ల నిర్వాహకులు
- డీటీసీ కార్యాలయంలోనూ పెత్తనం
- లైసెన్స్‌ల మంజూరుకు భారీగా వసూళ్లు
- చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధం



చిత్తూరు రూరల్: జిల్లాలో 12 డ్రైవింగ్ స్కూళ్లు ఉన్నాయి. ఈ డ్రైవింగ్ స్కూళ్లలో శిక్షణ పొందేందుకు వందల సంఖ్యలో చేరుతుంటారు. ఈ మధ్య కాలంలో మహిళలు డ్రైవింగ్ నేర్చుకునేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. దీంతో డ్రైవింగ్ నేర్చుకునేవారి సంఖ్య పెరిగింది. కొన్ని డ్రైవింగ్ స్కూళ్లు శిక్షణ కోసం వచ్చేవారిని నిలువు దోపిడీ చేస్తున్నాయి. ఎలాంటి అర్హతలు, నిబంధనలు లేకుండా శిక్షణ ఇవ్వకుండానే రూ.వేలల్లో వసూలు చేస్తున్నాయి. డ్రైవింగ్ నేర్చుకోవాలనుకునే వారి అవసరం, ఆసక్తిని అవకాశంగా మలుచుకుంటున్నాయి. ఎలాంటి శిక్షణ ఇవ్వకుండానే డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించేస్తున్నారు. ఫలితంగా డ్రైవింగ్ రాకపోయినా వాహనాలతో రోడ్డెక్కేస్తూ రహదారి భద్రతకు సవాళ్లు విసురుతున్నారు.

రూ.వేలల్లో వసూళ్లు

ఈ తరుణంలో కొందరు డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు శిక్షణ కోసం వచ్చేవారి నుంచి కాసులు దోచుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒక డ్రైవింగ్ స్కూళ్ల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకుని రెండేసి వాహనాలతో శిక్షణ ఇచ్చుకుంటున్నారు. నిర్ణీత ఫీజు వసూలు చేయడం లేదు. జిల్లా వ్యాప్తంగా సిండికేట్ అయి అందిన కాడికి దోచుకుంటున్నారు. డ్రైవింగ్ స్కూళ్ల ఫీజులు, శిక్షణ కాలం, శిక్షకుల అనుభవం తదితర అంశాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరికివారు ఇష్టం వచ్చినట్లుగా ఫీజులు వసూలు చేస్తున్నారు. 30 రోజుల శిక్షణకుగాను రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు వసూళ్లు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పైగా వారు శిక్షణకు వినియోగించే వాహనాన్ని బట్టి ఫీజులు నిర్ణయిస్తుండడం గమనార్హం. నెల రోజుల్లో పూర్తిగా నేర్పిస్తామని చెప్పినా.. మరో 2 నెలలు పొడిగించి అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారు. దీనికితోడు లెర్నింగ్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్సులను సైతం తామే ఇప్పిస్తామని డ్రైవింగ్ నేర్చుకునే వారి నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేసున్నారని అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇక కార్యాలయంలో అంతా తామై వ్యవహరిస్తూ డ్రైవింగ్ నేర్చుకునే వ్యక్తులను మభ్య పెడుతున్నారు. మరోవైపు తమ పలుకుబడి ఉపయోగించి కార్యాలయంలో డీఎల్ టెస్ట్ వచ్చే వారి కోసం వాహనాలు అద్దెకు ఇస్తుండడం గమనార్హం.

నిబంధనలకు తూట్లు

పాత వాహనాలకు మరమ్మతులు చేసి వాటిని శిక్షణకు ఉపయోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం పూర్తి కండీషన్‌లో ఉన్న వాహనాన్నే వినియోగించాలి. ప్రత్యేక శిక్షణ ఇచ్చే డ్రైవర్‌కు మెకానికల్ డిప్లొమా అర్హత ఉండాలి. వాహనం నేర్చుకునే వారికి ప్రత్యేకంగా తరగతులు నిర్వహించాలి. రేడియేటర్, ఇంజిను, టైర్లు చెక్ చేసుకోవడం, తదితర అంశాలపై శిక్షణ ఇవ్వాల్సి ఉంది. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాల్సి ఉంది. అనుభవం లేని డ్రైవింగ్‌తో నిత్యం వందల సంఖ్యలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం శిక్షణ, వాహనాలు, అనుభవం కలిగిన డ్రైవర్లను ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మళ్లీ గట్టిగా వార్నింగ్ ఇస్తాం

ఇటీవలే డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులను పిలిచి గట్టిగా వార్నింగ్ ఇచ్చాం. వారిపై వస్తున్న ఫిర్యాదులను సరిదిద్దుకోవాలని మందలించాం. మళ్లీ వాళ్లకు నియమ నిబంధనలు వివరించి, గట్టిగా వార్నింగ్ ఇస్తాం. డ్రైవింగ్ నేర్చుకునే వ్యక్తులు మోస పోకండి. అధిక ఫీజులు, లైసెన్స్ ఇప్పిస్తామని చెబితే ఫిర్యాదు చేయండి. కచ్చితంగా వారిపై చర్యలు తీసుకుంటాం.

– నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు